క్లుప్తంగా

పేపర్ ప్రజెంటేషన్‌లో ఇద్దరికి బహుమతి


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ విద్యార్థినులు పేపర్ ప్రజెంటేషన్‌లో ద్వితీయ బహుమతి సాధించారు. మంగళవారం ద్వితీయ బహుమతి సాధించిన ఇద్దరు విద్యార్థినులను ప్రిన్సిపాల్ డా.సుధాకర్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 25వ తేదీన జరిగిన వేవ్ ఫ్రంట్ 2కే25 అనే అంశంపై బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న గాయత్రీ, షబానాబేగం పేపర్ ప్రజెంటేషన్ చేసినట్లు చెప్పారు. వారు ప్రతిభ కనబరచటంతో ద్వితీయ బహుమతి లభించిందన్నారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు కాలేజీ బృందం అభినందించారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


108 చీరల అలంకరణలో వాసవీమాత

ఆదోని అర్బన్: పట్టణంలోని నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఆర్యవైశ్యులు జరుపుకున్నారు. మంగళవారం ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి ఆధ్వర్యంలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవికి 108 చీరలతో అలంకరించారు. అదేవిధంగా 108 మంది భక్తులతో తొమ్మిదిసార్లు మణిదీప వర్ణన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షులు రాంప్రసాద్, ట్రెజరర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఆదోని రూరల్: మండలంలో గత ఐదు వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని దొడ్డనకేరి, మాంత్రికి, పెసలబండ గ్రామాల్లోని ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వలసలను నివారించడంలో ప్రభుత్వం విఫలం


ఎస్.గోపాల్‌రెడ్డి

ఆదోని టౌన్: వలసలను నివారించడంలో కూటమి ప్రభుత్వం విఫలమయ్యిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, కర్నూలు జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఎస్.గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో ప్రతి గ్రామం నుంచి ఉపాధి పనులు లేక, కుటుంబాలను పోషించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు లేక అనేక కుటుంబాలు పిల్లాపాపలతో వలసలు వెళ్తున్నారన్నారు. తల్లిదండ్రులు వలసలు వెళ్లడంతో పిల్లలు చదువులకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి కూలీలకు ఉపాధి పనులు కల్పించి గిట్టుబాటు వేతనం కల్పించాలన్నారు.

షెడ్లు మంజూరు చేయండి

మంత్రాలయం : గ్రామాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధి కోసం రైతులకు గోకులం షెడ్లు మంజూరు చేయాలని సీపీఐ తాలూకా కార్యదర్శి భాస్కర్ యాదవ్, రైతులు కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శోభరాణిని మండలంలోని సూగూరు గ్రామ రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. రైతు సంఘం కార్యదర్శి గాబ్రెల్, హనుమంతు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం

పెద్దకడబూరు : పాడి రైతులు పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి డాక్టర్ జోత్స్నకుమారి అన్నారు. మండల పరిధిలోని పీకలబెట్ట గ్రామంలో మంగళవారం పశువైద్య ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మూలింటి లక్ష్మి, నాయకులు మూకరెడ్డి, హనుమంతు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజగోపురానికి లక్ష విరాళం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకుంటున్నారు. మంగళవారం అలూరు వాసి అయిన గూడూరు జ్యోతి, గూడూరు భాస్కర్ శెట్టి దంపతులు రూ.1,00,116 అందజేశారు. వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి సత్కరించారు.

ఊతమివ్వని 'ఉపాధి'

- కూలీలకు గిట్టుబాటుకాని వేతనం
- రోజుకు రూ.200 నుంచి రూ.210 మాత్రమే వస్తున్న వైనం
- నాలుగు వారాలుగా అందని వేతనం
- ఆరు రోజులు పని చేస్తే 4.5 రోజులకే కూలి
- వలసలు తప్పవంటున్న కూలీలు


ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కౌతాళం: గ్రామాల్లో ఉపాధి కరువై, చేసిన పనులకు కూలి అందక వలస వెళ్తున్నారు. దీంతో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. ఇక్కడే పనులు కల్పిస్తాం వలస వెళ్లొద్దు అని చెబుతున్న అధికారులు .. చేసిన పనులకు వేతనాలు చెల్లించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. పనులు చూపడం అటుంచి చేసిన పనులకు సైతం వేతనాలు ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. పైగా పనిదినాలు తగ్గించి కూలి ఇస్తుండటంతో ఉపాధి పనికంటే వలసవెళ్లడమే నయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తగ్గిన కూలీల సంఖ్య

మండలంలో 14,073 జాబ్ కార్డులు ఉండగా.. 10,096 కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. ఇందులో మండల కేంద్రంలో 1,902 జాబ్‌కార్డులు ఉండగా రోజూ కనీసం వంద మంది కూడా పనులకు రావడంలేదు. మండలంలోని గ్రామాల్లో వెయ్యి మంది కూడా పనులకు హాజరుకావడంలేదు. గతేడాది ఇదే సమయానికి 2,500 మంది దాకా పనులను సద్వినియోగం చేసుకున్నారు. ప్రస్తుతం పనులకు రాకపోవడానికి ప్రధాన కారణం చేసిన పనికి కూలి డబ్బులు తక్కువ రావడం . ఉపాధి హామీ చట్టం ప్రకారం పనిచేసిన 14 రోజుల్లోపు వేతనాలు ఇవ్వాల్సి ఉన్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడంలేదు. మండలంలో కూలీలకు నాలుగు వారాలుగా వేతనం అందక అల్లాడిపోతున్నారు. ఇప్పటి వరకు రూ.38లక్షలు వేతన బకాయిలు ఉన్నాయి.

వేతనంలో కోత

వారంలో 6 రోజులు పని చేస్తే 4 నుంచి 5 రోజులకే కూలీ డబ్బులు చెల్లిస్తున్నారు. దీనికి తోడు కూలి రూ.200 నుంచి రూ.210 వరకు మాత్రమే పడుతోంది. దీంతో ఉపాధి పనులకు వెళ్లడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు. వారం పని చేస్తే నాలుగు, ఐదు రోజుల కూలి రావడంతో పాటు నాలుగు, ఐదు వారలైనా వేతనం అందక పోవడంతో కూలీల ఇల్లు గడవటం కష్టంగా మారుతోంది. ఇలా డబ్బులు రాక పోవడం, వేతనం కూడా తక్కువ ఉండడంతో వలస వెళ్లక తప్పడంలేదని కూలీలు వాపోతున్నారు.

కూలి డబ్బులు వస్తాయి

ఉపాధి పనులు చేసిన వారికి డబ్బులు ఇప్పిస్తాం . మూడు వారాల నుంచి నిధులు మంజూరు కాలేదు. ఉపాధి కూలీలు తక్కువ పని చేస్తున్నందుకు కూలి తక్కువ పడుతోంది. రోజుకు కనీసం నాలుగు గంటలైనా పనిచేస్తే కచ్చితంగా రోజుకు రూ.300 కూలి పడుతుంది. తక్కువ పనిచేసినందుకు డబ్బులు తక్కువ వస్తున్నాయని ఉపాధి కూలీలు గమనించాలి. త్వరలోనే ఉపాధి కూలీల అకౌంట్లో వేతనం జమ చేయిస్తాం.

–ఏపీఓ బజారీ

రూ.200 మాత్రమే వస్తుంది



వారం రోజులు పని చేస్తే నాలుగు, ఐదు రోజుల కూలీ మాత్రమే ఇస్తున్నారు. ఇది ఏమటని ప్రశ్నిస్తే ఇది ఇంతే అంటూ ఫీల్డ్ అసిస్టెంట్‌తో పాటు అధికారులు కూడా దబాయిస్తున్నారు. అంతేకాక ఉపాధి కూలీ రూ.300 అంటున్నారు కానీ రోజు రూ.200 నుంచి రూ.210 వరకు మాత్రమే వస్తోంది. అది కూడా పనిచేసిన దీనాలకు కాకుండా తక్కువ దినాలకు డబ్బులు ఇస్తున్నారు. అందుకే ఉపాధి పనులకు పోవడం కన్నా గుంటూరు, బెంగళూరు వంటి పట్టణాలకు వెళ్లి బతకడం మేలు అని పిస్తుంది.

– చాగి హనుమంతు, ఉపాధి కూలీ, కౌతాళం

నాలుగు వారాలైంది కూలి డబ్బులు రాలేదు



ఇప్పటి వరకు నాలుగు వారాలైంది కూలి డబ్బులు రాలేదు. ఎలా బతకాలి. అధికారులు గ్రామాలకు వచ్చి సదస్సులు పెట్టి మీకు కూలి ప్రతి రోజు రూ.300 వస్తుంది, వలసలకు వెళ్లవద్దు అంటారు కానీ చెప్పేది ఒకటి చేసేది ఒకటి. పనిచేసిన దినాలకు కూలి డబ్బులు ఇవ్వకుండా తక్కువ దినాలకు ఇస్తున్నారు. అది కూడా రూ.200 వరకు మాత్రమే ఇస్తున్నారు. ఇలా అయితే ఉపాధి పనులకు వెళ్లినా ప్రయోజనం లేకుండ పోయింది. చెప్పిన విధంగా కూలి డబ్బులు ఇవ్వాలి.

– వెంకటేష్, ఉపాధి కూలీ, కౌతాళం

మార్చి 8న జాతీయ లోక్‌అదాలత్

ఆదోని రూరల్: మార్చి నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె. సుధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్, మోటార్ యాక్సిడెంట్ కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెక్‌పోస్టు తనిఖీ

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం చెక్‌పోస్టును మంగళవారం ఆదోని డీఎస్పీ హేమలత తనిఖీ చేశారు. కర్ణాటక అక్రమ మద్యం, ఇసుక అక్రమ రవాణా జరగకుండా సిబ్బందికి పలు సూచనలు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపాలని ఆదేశించారు. రూరల్ సీఐ నల్లప్ప, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

పెద్దకడబూరు : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రామ్మూర్తి సూచించారు. మండల పరిధిలోని కల్లుకుంట ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించి, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసారు. ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు అంటే ఎలాంటి భయం అవసరం లేదని, ప్రణాళికతో చదవితే లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చునన్నారు.

సీసీఐ కేంద్రాలను పరిశీలించిన సబ్‌కలెక్టర్


పత్తిని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని అర్బన్: పట్టణంలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాలను మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. ఎన్‌డీబీఎల్, ధారశ్రీ, జయంతి పరిశ్రమల్లో దూదిబేళ్లు, పత్తిగింజలు, రైతులు తెచ్చిన పత్తిని సబ్ కలెక్టర్ పరిశీలించారు. తర్వాత పత్తి కొనుగోలుకు సంబంధించిన రికార్డులను చూసి పత్తి ప్రాసెస్ గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పత్తి రైతులకు గిట్టుబాటు ధరకు సంబంధించిన అంశాలపై మార్కెట్ అధికారులతో సమీక్షించారు. తనిఖీలో సబ్ కలెక్టర్ వెంట మార్కెట్‌యార్డు ఏడీఈ నారాయణమూర్తి, ఆదోని యార్డు సెక్రటరీ రామ్మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్, సీసీఐ నిర్వాహకులు భరత్‌కుమార్, గౌతమ్, డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

ఆదోని రూరల్: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఢణాపురం గ్రామంలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకున్న వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్‌కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు నాలా యాక్ట్ ప్రకారం ఐదు శాతం రుసుము చెల్లించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గుండాల నాయక్, వీఆర్వో రాజశేఖర్‌గౌడ్, విలేజ్ సర్వేయర్, అధికారులు ఉన్నారు.

ప్రజల సహకారంతోనే ట్రాఫిక్ సమస్య పరిష్కారం


సమస్యలపై చర్చిస్తున్న కమిషనర్, డీఎస్పీ, ట్రాఫిక్ సీఐ, అధికారులు

ఆదోని టౌన్: దశాబ్దాల కాలంగా ఆదోనిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను ప్రజల సహకారంతో పరిష్కరించవచ్చని డీఎస్పీ హేమలత, మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ, ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు తెలిపారు. ఆదోని అభివృద్ధి, ప్రజా సమస్యలపై మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఛాంబర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రధాన సర్కిళ్లలో మైకులు, ట్రాఫిక్ పోలీసులు డ్యూటీ చేసేందుకు అవసరమైన గొడుగుల ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు కోరారు. ప్రధాన రోడ్లలో స్పీడు బ్రేకర్ల ఏర్పాటు చేయాలని, పాత బస్టాండు సర్కిల్‌లో డివైడర్లు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య అస్తవ్యస్తంగా మారింద తెలిపారు. ఆదోనిలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, అందుకు తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. సమావేశంలో ఎంఈ ఇంతియాజ్‌అలీ, అసిస్టెంట్ సిటీ ప్లానర్ కృష్ణాసింగ్, టీపీఓ బాలమద్దయ్య, డీఈ గోపీనాథ్ పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం మినరల్ వాటర్


ఉపాధ్యాయులు, అధ్యాపకులతో చర్చిస్తున్న పారిశ్రామిక వేత్తలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థుల కోసం ప్రతి రోజు వెయ్యి లీటర్ల మినరల్ వాటర్ సరఫరా చేస్తామని ప్రముఖ పారిశ్రామిక వేత్త మాచాని రమేష్ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక పారిశ్రామిక వేత్త కేఎస్‌పీ శివన్నతో కలిసి పాఠశాల, కళాశాలను సందర్శించారు. హెచ్‌ఎం చిత్రలేఖ, ప్రిన్సిపాల్ ప్రసాద్, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు. పాఠశాలలో మంచినీటి సమస్యను ఉపాధ్యాయులు వారి దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరించేందుకు ప్రతి రోజూ మినరల్ వాటర్ సరఫరా చేస్తామన్నారు. అదే విధంగా ఏటా పదో తరగతిలో మెరిట్ విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు ఇస్తామని ప్రకటించారు.

నీటి ఎద్దడిని నివారించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ

నందవరం : గ్రామాల్లో తాగునీటి ఎద్దటి నివారణపై అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పుల్లయ్య ఆధ్వర్యంలో మండల సర్వసభ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధిలు సమన్వయంతో గ్రామాభివృద్ధికి కృషి చేయాలన్నారు. అలాగే వలసల నివారణపై ఉపాధి హామీ అధికారులు గ్రామాల్లో ఉపాధి పనులపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం హాలహర్వి ఎంపీటీసీ జగ్గాపురం హనుమంతమ్మ మాట్లాడుతూ..గ్రామంలో తీవ్ర నీటిఎద్దడి నెలకొందని, నీటి సమస్య పరిష్కరానికి అధికారులు కృషి చేయాలని సభ దృష్టికి తీసుకురాగా ఎంపీడీఓ స్పందించి 15 రోజుల్లో గ్రామంలో నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. జెడ్పీటీసీ నిఖిల్‌చక్రవర్తి, డీటీ శశిశేఖర్, ఎంఈఓ-1 సుదర్శన్‌రెడ్డి, ఈఓపీఆర్డీ సందీప్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో డీలర్ మృతి

నందవరం : మండల పరిధిలోని చిన్నకొత్తిలి గ్రామంలో రేషన్ డీలర్ సిద్దరాముడు(65) అనారోగ్యంతో మృతి చెందాడు. దాదాపు గ్రామంలో 30 ఏళ్లుగా డీలర్‌గా కొనసాగారు. అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృత్యువాత పడ్డాడు.

అన్న క్యాంటీన్‌లో ప్లేట్లు కడగమంటున్నారు


కమిషనర్‌తో మాట్లాడుతున్న బసాపురం యల్లప్ప

ఆదోని రూరల్: అన్న క్యాంటీన్‌లో గ్రామీణ ప్రాంతాల నుంచి భోజనాలు చేసేందుకు వచ్చిన వారితో ఇతరుల ప్లేట్లు తీయించి, కడగమంటున్నారని మాల మహానాడు డివిజన్ అధ్యక్షుడు బసాపురం యల్లప్ప మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు ఫిర్యాదు చేశారు. మంగళవారం అన్నా క్యాంటీన్ తనిఖీకి వచ్చిన కమిషనర్‌కు ఆయన ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ అన్నా క్యాంటీన్‌లో వలంటీర్‌గా చేస్తున్న వారు గ్రామాల నుంచి వచ్చిన వారిని బెదిరిస్తూ వారితో ప్లేట్లు తీయించారన్నారు. తాను తిన్న ప్లేటు కడిగా పెట్టామని చెబుతున్నా.. వినకుండే నువ్వే ప్లేట్ పెట్టి వెళ్లిపోయావు, ఆ ప్లేట్ తీసి పక్కన పెట్టు అని దబాయిస్తున్నారని చెప్పారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ అన్నా క్యాంటీన్ సిబ్బంది పద్ధతి మార్చుకోవాలని, భోజనం చేసే వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తే విధుల నుంచి తొలగిస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్, దశరథి, లక్ష్మీకాంత్, వీరేష్, నాగరాజ్, లక్ష్మన్న, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పనులు చేయండి

- అధికారం శాశ్వతం కాదు.. ప్రజలు శాశ్వతం
- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఆగ్రహం


ఏపీఓను నిలదీస్తున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: అధికారం శాశ్వతం కాదు, ప్రజలు శాశ్వతం .. పార్టీలకు అతీతంగా అభివృద్ధి పనులు చేయాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన, ఎంపీడీఓ పి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో ప్రొటోకాల్ పాటించడం లేదని మండి పడ్డారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రధానంగా గ్రామాల్లో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామంలో ఏ అభివృద్ధి పనులు చేసిన వారి సమాచారం ఇవ్వాలన్నారు. ప్రొటోకాల్ పాటించని వారి పై చర్యలకు సిఫారస్ చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 8 నెలలు గడిచినా గ్రామాల్లో అభివృద్ధి చేయడం వదిలేసి ఫీల్డ్ అసిస్టెంట్స్, ఇతర శాఖలలో పనిచేసే కింది స్థాయి కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. గత ఐదేళ్ల మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనతో పార్టీలకు అతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. ఏనాడు జగన్ మోహన్ రెడ్డి పార్టీల వారీగా పనులు చేయాలని సూచించలేదన్నారు. ఇకనైనా నిష్పక్షపాతంగా ప్రజలకు పనులు చేసిపెట్టాలని సూచించారు.

రాష్ట్రంలో అత్యధికంగా వలసలు

రాష్ట్రంలోనే అత్యధికంగా కోసిగి మండలం నుంచి పనుల కోసం ఇతర ప్రాంతాలకు ప్రజలు తరలివెళ్తున్నారని, ఇప్పటి వరకు మండలంలో 70 శాతం ప్రజలు వెళ్లిపోయారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న వారికి పనులకు కల్పించడంలో రాజకీయం చేయడం ఏమిటని ఏపీఓ మాధవశంకర్‌ను నిలదీశారు. గ్రామాల్లో వారి అనుకూల మేటీల ఆధారంగా పనులకు వెళ్తితే అడ్డు పడడం ఏమిటని ప్రశ్నించారు. ఇలా జరిగితే ఉన్నవారు కూడా వలస వెళ్లిపోతారని, దీనికి మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

- కోసిగిలో మంచి నీటిని వదలడం లేదని ఎంపీపీ ఈరన్న, సభ్యులు ఈఓపీఆర్డీ హారూన్ రషీద్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ తిమ్మారాజుని పశ్నించారు. ఎమ్మెల్యే నిధులతో పులికనుమ వద్ద మూడు మంచి నీటి బోర్లు వేసిన ఎందుకు నీటి సరఫరా చేయడం లేదన్నారు. పరిశీలించి మంచినీటిని అందించేలా చూస్తామని ఏఈ సమాధానమిచ్చారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.
- హాస్పిటల్‌లో మందులు బయటకు చీటీలు రాసిస్తున్నారని, కాన్పులకు డబ్బులను వసూలు చేస్తున్నారని సభ్యులు డాక్టర్ మనోజ్‌కుమార్‌ను ప్రశ్నించారు. హాస్పిటల్‌లో గైనికాలజిస్ట్ ఏర్పాటుకు మండల తీర్మానం చేస్తామన్నారు.
- విద్యుత్ స్తంభాలు లేని చోటు కొత్త ఏర్పాటుకు చేయాలని ట్రాన్స్ కో ఏఈ వీరేష్‌కు సూచించారు.
- ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసి నిర్మించుకునేలా చూడాలని హౌసింగ్ ఏఈ మంజునాథ్‌కు సూచించారు.
- గ్రామాల్లో గ్రామ పొదుపు మహిళల సభ్యుల తీర్మానం లేకుండా వీబీకేలకు తొలగించారని ఏపీఎం సత్యమ్మకు సూచించారు.
- ఆయకట్టు దారులందరిని సాగునీటిని అందించేలా చూడాలని ఎల్లెల్సీ ఏఈ రవిప్రసాద్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రుద్రగౌడ్, జెడ్పీటీసీ పవిత్రపాటిల్, కోఆప్షన్ మెంబర్ షౌకత్ అలి, వైస్ ఎంపీపీ మాన్వి లక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

30న మున్సిపల్ షాపుల వేలాలు

ఆదోని టౌన్: పట్టణంలో 18 మున్సిపల్ షాపులకు ఈనెల 30వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. 30వ తేదీన సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో వేలం పాటలు జరుగుతాయని చెప్పారు. ఆసక్తి ఉన్న వ్యాపారులు వేలంలో పాల్గొనాలన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

ఆదోని సెంట్రల్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో కర్నూలు జిల్లా క్రీడాకారులు ప్రతిభను కనపరిచి మూడవ స్థానంలో(బ్రోంజ్ మెడల్) సాధించారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శుభకర్, సహాయ కార్యదర్శి అమర్ ప్రకాశ్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు విశాఖపట్టణం అనకాపల్లి అంకపాలెంలో 71వ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు జరగాయని తెలిపారు. కర్నూలు జిల్లా టీంలో ఆదోని నుంచి మహిళా జట్టులో హనుమాన్ నగర్‌కు చెందిన సుమంగళ, టీజీఎల్ కాలనీకి చెందిన సంధ్య, పురుషుల విభాగంలో ఫిలిప్స్ టీం రాజు, విజయనగర్ కాలనీకి చెందిన అవినాష్ పాల్గొన్నారని చెప్పారు. కబడ్డీ అసోసియేషన్ ట్రెజరర్ సురేష్, సెలెక్షన్ కమిటీ సభ్యులు గోవిందు, శీలన్న తదితరులు క్రీడాకారులను అభినందించారు.

నేటి నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామంలో శ్రీ సక్రవళి తాతా ఉరుసును పురస్కరించుకొని డీలర్ మాదన్న జ్ఞాపకార్థం బుధవారం నుంచి ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు గోపాల్, నాగార్జున, రామాంజి, ఓబులేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతి రూ. 15,016, రెండవ బహుమతిగా రూ.10,016 ఇవ్వనున్నట్లు చెప్పారు. రూ. 800 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 90104 60061, 8328131449 నంబర్లను సంప్రదించాలన్నారు.

సివిల్ సర్వీసెస్‌పై అవగాహన

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌పై తగిన అవగాహన కలిగి వుండాలని స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా అన్నారు. మంగళవారం కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ నారాయణ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ వారిచే సివిల్ సర్వీసెస్ పరీక్షలు, కొలువులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోచింగ్ సెంటర్ అధ్యాపకులు హర్షవర్ధన్ సివిల్ సర్వీసెస్ గురించి విద్యార్థులకు వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ, నాక్ కోఆర్డినేటర్ పాల్‌దేవదానం తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణ అందరి బాధ్యత


హాలహర్విలో మాట్లాడుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు

నందవరం : మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని, వారి రక్షణ మనందరి బాధ్యతయని ఎమ్మిగనూరు సర్కిల్ డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హాలహర్వి గ్రామంలో గ్రామస్తులకు సైబర్ నేరాలు, మహిళల రక్షణ, రోడ్డు నింబంధనలు, బాల్య వివాహాలు నిర్మూలన, మత్తు పదర్థాల వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని, బాల్య వివాహాలు చేస్తే శిక్షార్హులవుతారని వివరించారు. వాహన దారులు రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు.

నాటుసారాకు దూరంగా ఉండండి

పెద్దకడబూరు : ప్రజలు నాటుసారాకు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ భార్గవరెడ్డి సూచించారు. మండల పరిధిలోని ముచ్చగిరి గ్రామంలో మంగళవారం నాటుసారా తీసుకుంటే కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు అక్రమంగా నాటుసారా తయారుచేసి కటకటాల పాలవుతుండటంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కొందరు వ్యక్తులు నాటుసారా తాగి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ హనుమంతప్ప, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో కురువ రాము, మహబూబ్‌బాషా ఇంట్లో నిల్వ ఉంచిన కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆదోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సైదుల్ మంగళవారం తెలిపారు. ఇందులో ఏడు బాక్సుల కర్ణాటక మద్యం(672 టెట్రా ప్యాకెట్లు)ను స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోని రూరల్: పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ వెంకటేష్ అనే వ్యక్తి నాటుసారా తరలిస్తూ మంగళవారం పట్టుబడ్డాడని ఇన్చీ ఎస్ఐ నాగేంద్ర తెలిపారు. సదరు వ్యక్తి సుల్తానాపురం గ్రామ సమీప కొండల్లో నాటుసారా తయారు చేసుకుని తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు చెప్పారు. అతని వద్ద ఉంచి 25 లీటర్ల నాటుసారా, మోటార్ బైక్‌ను సీజ్ చేసి, కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

జాబ్‌మేళాలో 31 మందికి ఉద్యోగాలు

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఏపీ నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 31మంది యువతీ యువకులు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, బీఎంఎస్ సెక్యూరిటీ, సన్ కిసాన్ అగ్రి కో కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలో 65 మంది పాల్గొనగా 31మంది ఎంపికయ్యారు. వారికి కళాశాల ప్రిన్సిపాల్ మహబుబ్‌బాషా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుశీలమ్మ నియామక పత్రాలను అందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ అధికారి సాయితేజ, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేద్దాం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నాగేశప్ప

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి వార్డుల్లో నాయకులు, కార్యకర్తలు ఐక్యతతో కృషి చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని 24వ వార్డులో మున్సిపల్ వార్డు కౌన్సిలర్ రామాంజినమ్మ, వార్డు ఇన్‌చార్జ్ రుద్రాక్షల బజారి అధ్యక్షతన వార్డు పార్టీ శ్రేణుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యూకే రాజశేఖర్, వార్డు నాయకులు రవిచంద్ర, నారాయణ స్వామి, గిరి, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.